# ఎవరు మీరు..?

కార్యకర్తలను, ఓటర్లను గుర్తుపట్టలేని అపరమేధావి

ఎవరు వెళ్లినా కొత్తగా పరిచయం చేసుకోవాల్సిందే..

మరో గజినిలా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ నేత

పార్టీలో వెల్లువెత్తుతున్న వ్యతిరేకత

వినోద్ కుమార్‌ను వెంటాడుతున్న ఓటమి భయం

కార్యకర్తలను పెద్దగా పట్టించుకోరని అపవాదు

పెద్ద స్థాయి వాళ్లకే ప్రాధాన్యం ఇస్తారంటూ విమర్శలు

ఒకే సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తారని గుసగుసలు

ప్రచారంలో కనిపించని ఎమ్మెల్యేలు, మాజీలు

కరీంనగర్ పార్టీలో గ్రూపుల కొట్లాటలు



*(తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ బ్యూరో)*

**'ఎవరు మీరు..?'.. నమస్తే సర్.. అని ఏ కార్యకర్త, ఏ ఓటరు వెళ్లినా.. ఇలా అడగడం ఆ అపరమేధావికి అలవాటు.** తాను అపరమేధావిని అని తనకు తాను చెప్పుకునే ఆ నేత.. కనీసం కార్యకర్తలను, తనకు ఓటు వేసిన ఓటర్లను సైతం గుర్తుపట్టరని అపవాదు ఉంది. కలిసినప్పుడల్లా కొత్తగా పరిచయం చేసుకోవాల్సిన పరిస్థితి అని కార్యకర్తలు గుసగుసలాడుకుంటున్నారు. కేవలం తన సామాజిక వర్గానికి చెందిన వారినే గుర్తుపెట్టుకోవడం.. వారికే ప్రాధాన్యం ఇవ్వడం ఆయనకున్న పెద్ద అలవాటని అంటుంటారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడు కావడంతో.. ఆ పదేళ్లు అటు పార్టీలోనూ, ఇటు జిల్లాలోనూ ఆయనదే హవా సాగింది. అధికారాన్ని అడ్డుపెట్టుకొని పలు అక్రమాలకు సైతం పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదే అధికారంతో తమ బంధువులకు ఉద్యోగాలు ఇప్పించుకున్నారని.. తదితర ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఆయన ఎవరో కాదు.. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న బోయినపల్లి వినోద్ కుమార్. అవును.. ఇప్పుడు ఆయనపై అటు పార్టీ కేడర్.. ఇటు ప్రజలు సైతం వ్యతిరేకతతో ఉన్నట్లుగా రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. దీనికితోడు సొంత పార్టీ ముఖ్యనేతలంతా ఆయనకు మద్దతు తెలిపేందుకు వెనకడుగు వేస్తున్నట్లుగా సమాచారం.

TELANGANA CAPITAL

తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

బుధవారం 17 ఏప్రిల్ 2024 www.telanganacapitalnews.com

EVENING EDITION

## అంటిముట్టనట్లుగా నాయకులు

రేపు పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడ నుంది. మే 13న పోలింగ్ డే. అయితే.. ఇప్పటికే ప్రచారపర్వం కూడా మొదలైంది. కానీ.. వినోద్ కుమార్ వెంట మాత్రం చెప్పుకోదగిన క్యాడర్ కనిపిం చడం లేదు. అటు.. పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు సైతం ఆయన వెంట రావడం లేదు. దాంతో అన్నీ తానై ముందుకు సాగుతున్నారు. ముఖ్యనేతలంతా ప్రచారానికి ఆమడదూరం ఉంటుండడంతో ఈ ఎన్నికల్లో గెలుపు అంత ఈజీ కాదు అనే టాక్ వినిపిస్తోంది. వినోద్ కుమార్ సతీమణి మాధవి నియోజకవర్గం మొత్తం చుట్టివస్తున్నా.. ఆమె వెంట కూడా ముఖ్యనేతలు ఎవరూ కనిపించడం లేదు. ఇటీవల మానకొండూర్ నియోజకవర్గం పరిధిలో ప్రచారానికి వెళ్లిన ఆమెతో అక్కడి మాజీ ఎమ్మెల్యే ప్రచారంలో పాల్గొనలేదు. అంతేకాదు.. ఆమె ప్రచారం కొనసాగిస్తుంటే ఆయన మాత్రం పరామర్శలకు వెళ్లడం విమర్శలకు దారితీసింది. అటు గ్రామస్థాయిలోనూ ప్రస్తుతం వినోద్ కుమార్‌కు పెద్దగా సపోర్టు లభించడం లేదని టాక్. అంతేకాదు.. అక్కడి నేతల్లో నెలకొన్న అభిప్రాయభేదా లను కొలిక్కి తెచ్చి ఏకం చేయలేకపోతున్నారని అపవాదు కూడా ఉంది.

## 2019లో ఓటమికి వీరే కారణం..?

2018 ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వచ్చింది. ఆ వెంటనే 2019లో పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. కానీ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ తరఫున బరిలోకి దిగినా కరీంనగర్‌లో మాత్రం వినోద్ కుమార్‌కు ఓటమి తప్పలేదు. ముగ్గురు మంత్రులు, ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నారు. అయితే.. సొంత పార్టీ నేతల వ్యవహారం వల్లే ఆయన ఓడిపోయారనేది బహిరంగ రహస్యం. పార్టీలో ఉంటూనే.. వినోద్ ఓటమికి కుట్రలు చేశారని భారీ విమర్శలే వచ్చాయి. వినోద్ కేవలం తన సామాజిక వర్గానికి చెందిన నేతలనే అక్కున చేర్చుకోవడం.. ఇతర నేతలను పట్టించుకోకపోవడం కూడా మైనస్ అని సమాచారం. మరోవైపు.. చొచ్చుకుపోయే తత్వం లేకపోవడం.. కార్యకర్తలతో కలివిడిగా లేకపోవడం కూడా ఆయనపై అభిమానం కోల్పోవడం కారణమని తెలుస్తోంది.

## బీఆర్ఎస్‌పై వ్యతిరేకత..

ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీపై రాష్ట్రవ్యాప్తంగా ఎంత వ్యతిరేకత ఉన్నదో అందరికీ తెలిసిందే. అదే వ్యతిరేకతతో రాష్ట్రంలో పార్టీ అధికారం కోల్పోయింది. ఇటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లోనూ చాలా స్థానాలు కోల్పో యింది. అటు బీఆర్ఎస్ నేతలు సైతం అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎన్నో అక్రమాలు, భూదందాలు, కబ్జాలు చేసిన ఆరోపణలు ఉన్నాయి. కరీంనగర్‌లో చాలా మంది నేతలు అరెస్టై జైలు పాలు కూడా అయ్యారు. దాంతో నగరంలోనూ పార్టీపై చాలా వరకు వ్యతిరేకత ఉంది. అంతేకాకుండా.. కరీంనగర్‌లో ఓ సామాజికవర్గానికి చెందిన అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు మీటింగ్ పెట్టుకొని తమ సామాజికవర్గానికి చెందిన నాయకుడిని గెలిపించుకోవాలని తీర్మానం చేశారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ నేతలు సైతం హాజరుకావడం గమనార్హం. ఇలాంటి వ్యతిరేక పవనాల మధ్య వినోద్ ఎలా ముందుకు సాగుతారు అనేది పెద్ద సస్పెన్స్.